## 'దోస్త్'లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 16: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్ పోర్టల్‌లో ఈనెల 21లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న తొలి అడ్మిషన్ల కేటాయింపు జాబితా విడుదల అవుతుందని పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి జూన్ 6వ తేదీ వరకు అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 7901097706, 8121158330 నంబర్లను సంప్రదించాలన్నారు.

## ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



శివ్వంపేట, మే 16: విగ్రహాల ప్రతిష్ఠాపనకు రావాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి శ్రీగురుపీఠం చైర్మన్ శివకుమార్‌గౌడ్, రమణాగౌడ్ ఆహ్వాన పత్రాలను శుక్రవారం అందజేశారు. గూడురులో నిర్మించిన దత్తాత్రేయ, షిర్డీసాయిబాబా ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠాపన జూన్ 5న నిర్వహించనున్నారు. వారితో వజ్జ హనుమంతు, సాయికిరణ్, న్యాయవాదులు రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, హబీబ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

## నేడు మంత్రులు రాక

చిలిపిచెడ్,మే 16: మండలానికి ముగ్గురు మంత్రులు రానునట్లు తహసీల్దార్ సహదేవ్ శుక్రవారం తెలిపారు. శనివారం చిలిపిచెడ్ రైతు వేదికలో భూ భారతి సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరుకానునట్లు తెలిపారు.

## ఆకస్మికంగా ఉపాధ్యాయుల శిక్షణ పరిశీలన



ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలిస్తున మధన్‌మోహన్

మెదక్ మున్సిపాలిటీ, మే 16: మెదక్‌లోని కేజీబీవీలో ఉపాధ్యాయుల శిక్షణను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ మదన్‌మోహన్ శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారులను శిక్షణ కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలో సమ్మర్ క్యాంపులు, ఉల్లాస్, బడిబాట, ఉచిత యూనిఫాంలు, పుస్తకాల పంపిణీపై డీఈవో రాధాకిషన్‌తో కలిసి సమీక్షించారు. వారితో అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి ఉన్నారు.

## బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

నిజాంపేట, మే16: నిజాంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు నెలల క్రితం ప్రశాంత్ తన ఫోన్ పొగొట్టుకుని, సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫోన్‌ను వెతికి ఎస్సై రాజేశ్ బాధితుడికి శుక్రవారం అందజేశారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



రామాయంపేట, మే 16: కోనాపూర్‌లో బుచ్చిరెడ్డికి రూ.10,500 చెక్కును పీఏసీఎస్ డైరెక్టర్ మామిడి సిద్ధరాములు అందజేశారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నిజాంపేట, మే 16: రజాక్‌పల్లి పంచాయతీ పరిధిలోని ఖాసీంపూర్‌లో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నీలం కనకరాజు, కుంట కనకరాజు, దావూద్, ప్రశాంత్, మధు పాల్గొన్నారు.

## ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి



రామాయంపేట, మే 16: డివిజన్‌లోని రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఏవో రాజ్‌నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆధార్ కార్డుతో ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1150మంది రైతుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారన్నారు. కోనాపూర్, ఝాన్సీలింగాపూర్, లక్ష్మాపూర్‌ల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, సాయికృష్ణ, ప్రవీణ్ ఉన్నారు.


## అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

చిన్నశంకరంపేట,మే16: రేషన్ సరఫరాలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని తహసీల్దార్ మన్నన్ హెచ్చరించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి బియ్యాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల డీలర్‌లు పాల్గొన్నారు.

## రుద్రారంలో ఉచిత వైద్య శిబిరం

చిన్నశంకరంపేట, మే16: రుద్రారంలో మల్లారెడ్డి దవాఖాన యాజమాన్యం సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో దాదాపు 100మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దగ్గు, జ్వరం, మోకాళ్ల నొప్పులు, షుగర్, బీపీ, వంటి చికిత్స చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రోహిత్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మంచాల లక్ష్మణ్, ఉపసర్పంచ్ మంద్రు ప్రసాద్ పాల్గొన్నారు.

## యమపాశాలుగా విద్యుత్ తీగలు



నిజాంపేట, మే 16: నస్కల్ గ్రామానికి చెందిన యా దయ్య వ్యవసాయ పొలం వద్ద 11 కేవీ విద్యుత్ తీగ లు యమపాశాలుగా వేలాడుతున్నాయి. ఈ తీగల కింద నిలబడితే చేతికి అందేలా ఉన్నాయి. విద్యుత్ తీగలను సరిచేయాలని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని రైతు యాదయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు విద్యుత్ అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## చిట్టీల వ్యాపారి ఆత్మహత్య

రామాయంపేట, మే 16: చిట్టీల వ్యాపారి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గడ్డం గంగారాం(55) పట్టణంలో చిట్టీల వ్యాపారం చేస్తుంటాడు. రాత్రిపూట వాకింగ్‌కు అని బయలుదేరి పట్టణ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. పోలీసులు, కుటుంబసభ్యులు, స్నేహితులు పరిశీలించారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని ఎస్సై బాలరాజు ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం

- తడిసిన ధాన్యం వెంటనే కొనాలి
- కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను మిల్లుకు చేర్చాలి
- ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



కొల్చారం: తడిసిన ధాన్యం రాశిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి



రాంపూర్‌లో జరిగిన గంగిడి పోచయ్య కుమార్తె వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

కొల్చారం, మే 16: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం జరిగిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోతంశెట్టిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. తడిసిన ధాన్యం రాశులు, లారీలు రాక ఎక్కడికక్కడే ఉన్న తూకం వేసిన బస్తాలను పరిశీలించారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి వెంటనే ధాన్యం తరలించడానికి లారీలు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థతతోనే ధాన్యం వర్షానికి తడిసి, రైతులు నష్టపోవాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. కోతలు మొదలుకాగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. తీరా 10, 15 రోజులకు గాని తూకం ప్రారంభించలేదన్నారు. తూకం ఆలస్యం కావడంతో కేంద్రాల్లో ధాన్యం రాశులు పేరుకుపోయాయన్నారు. ఇప్పుడు అకాల వర్షాలకు తడిసి మొలకలు వచ్చాయన్నారు. కొన్ని చోట్ల వడ్లు ముక్కిపోయాయన్నారు. పోతంశెట్టిపల్లి కొనుగోలు కేంద్రంలో సుమారు 9 లారీల సన్నరకం, మరో 19 లారీల దొడ్డు రకం ధాన్యం ఉందన్నారు. మొలకలు వచ్చిన, ముక్కిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకునే పరిస్థితి లేదన్నారు. పది, పన్నెండు రోజులుగా కొనుగోలు కేంద్రాలకు లారీలు రావడం లేదన్నారు. కొల్చారం, పోతంశెట్టిపల్లి, చిన్నఘనపూర్, రంగంపేట, పైతర, కోనాపూర్, ఎనగండ్ల, వై మాందాపూర్ గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు పంపించాలన్నారు.

### వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్ రాంపూర్ గ్రామ అధ్యక్షుడు గంగిడి పోచయ్య కుమార్తె వివాహ వేడుకలు మాచవరం సమీపంలోని రాజేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరయ్యారు. మండల నాయకులతో కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట మాజీ జడ్పీటీసీ మేఘమాల సంతోష్ కుమార్, సీడీసీ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మన్సూర్ అలీ, కొమ్ముల యాదాగౌడ్, గౌరీశంకర్, సిద్దిరాములు, చిట్యాల యాదయ్య, యాదగిరి తదితరులు ఉన్నారు.

# డెంగీని నివారించేందుకు చర్యలు చేపట్టాలి

- ప్రాథమిక స్థాయి నుంచే ఉత్తమ విద్యా బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



విద్యాబోధనపై సూచనలు చేస్తున్న కలెక్టర్

మెదక్, మే 16 (నమస్తే తెలంగాణ): సమాజంతో భాగస్వామ్యమై డెంగీని నివారించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్‌లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగీ గురించి అవగాహన పెంచడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ 2010 మే 16 నుంచి జాతీయ డెంగీ దినోత్సవాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు. వానకాలంలో డెంగీ కేసులు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డెంగీపై జిల్లాలో ప్రజలను అప్రమత్తం చేస్తూ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. డెంగీ ఇతర కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా జూన్ నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. డెంగీ లక్షణాలు ఉంటే పీహెచ్‌సీకి, జిల్లా దవాఖానకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారను. డెంగీ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుపాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమములో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీత, ఇంటర్మీడియెట్ అధికారి మాధవి, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు సృజన, జ్ఞానేశ్వర్, డీ.సీహెచ్‌వోలు డాక్టర్ శివదయాల్ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

### గుణాత్మక విద్యాబోధనకు కృషి చేయాలి

మెదక్ మున్సిపాలిటీ, మే 16: ప్రాథమిక స్థాయి నుంచే గుణాత్మక విద్యాబోధన అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం డైట్ కళాశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని కలెక్టర్ పర్యవేక్షించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడేలా శిక్షణ దోహదపడుతుందని, అనుభవం గల జిల్లా రిసోర్స్‌పర్సన్లతో టీచర్లకు వృత్తిపరమైన బోధన, అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సాంఘిక, ఇంగ్లిష్, గణితం విషయాల్లో మూడు విడతల్లో గుణాత్మక శిక్షణ ఉంటుందన్నారు. డీఈవో రాధాకిషన్, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

# సమ్మర్ క్యాంపులో అనేక అంశాలపై అవగాహన



రామాయంపేట: బహుమతులు అందజేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు





నర్సాపూర్: సమ్మర్ క్యాంప్ ముగింపులో ఎంఈవో తారాసింగ్, విద్యార్థులు

రామాయంపేట/నర్సాపూర్, మే 16: పదిహేను రోజుల నుంచి సమ్మర్ క్యాంపులో విద్యార్థులు హాజరై అనేక అంశాలపై అవగాహన పెంచుకోవడం హర్షించదగ్గ విషయమని రామాయంపేట ఎంఈవో అయిత శ్రీనివాస్ అన్నారు. నర్సాపూర్‌లోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్‌లో ఎంఈవో తారాసింగ్ పాల్గొన్నారు. శుక్రవారం సమ్మర్ క్యాంపు ముగింపులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 15 రోజులుగా యోగా, చిత్రలేఖనం, క్రీడలు, ధ్యానంపై సమగ్రంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలను ఇంటి దగ్గర ప్రాక్టీస్ చేయాలన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



శివ్వంపేట: వివరాలు తెలుసుకుంటున్న ఎంఈవో



రామాయంపేట:కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీచర్లు



నిజాంపేట: బడిబాటలో హెచ్‌ఎం జ్ఞానమాల

రామాయంపేట, మే 16: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, అందుకు బడిబయట పిల్లలను సర్కారు బడుల్లోనే చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కోనాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో బడిబాటను ప్రారంభించారు. లక్ష్మాపూర్, ఝాన్సీలింగాపూర్, సుతారిపల్లి, డీ.ధర్మారం, శివ్వాయపల్లి గ్రామాల్లో ఎంఈవో పర్యటించారు. గ్రామాలు, పట్టణాల్లో బడిబయట పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు.

**అక్కన్నపేటలో బడిబాట కార్యక్రమం.**

రామాయంపేట రూరల్, మే 16: అక్కన్నపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్లు బడిబాట చేపట్టారు. ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, నాణ్యమైన భోజనం అంశాలను వివరించారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, మే16: నిజాంపేటలోని జడ్పీహెచ్‌లో హెచ్‌ఎం జ్ఞానమాల ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీని ఎంఈవో యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

**పిల్లుట్లలో బడిబాట**

శివ్వంపేట, మే 16: పిల్లుట్లలో ఎంఈవో బుచ్యానాయక్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల వివరాలు సేకరించారు. ప్రభుత్వ పాఠశాలల పని తీరును, అందిస్తున్న విద్యా సదుపాయాలను వివరించారు.

# కంపు కొడుతున్న రైతు బజార్

- అలంకార ప్రాయంగా కూరగాయల మార్కెట్
- రూ.50లక్షలతో నిర్మించిన కేసీఆర్ ప్రభుత్వం
- ప్రభుత్వం మారడంతో వెలవెల బోతున్న మార్కెట్ స్టాళ్లు
- పట్టించుకోని ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్



ఎక్కడి చెత్త అక్కడే



దుర్గంధంగా కూరగాయలు, మటన్ స్టాళ్లు



ఎక్కడి చెత్త అక్కడే ఉన్న దృశ్యం



రామాయంపేటలోని కూరగాయల మార్కెట్



టాయిలెట్లకు పోయే దారిలో మురుగు కూపం

రామాయంపేట, మే 16: లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్ నేడు వెలవెలబోతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2015లో రూ.50 లక్షలతో ఆధునాతనంగా కూరగాయలు, మటన్, చికెన్ విక్రయాల కోసం మార్కెట్ నిర్మించింది. అప్పటి మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మెదక్ ఎమ్మెల్యే, ఉప సభాపతిగా ఉన్న పద్మాదేవేందర్‌రెడ్డి పట్టణ ప్రజలు, వ్యాపారుల సౌలభ్యం కోసం రైతు బజార్‌ను నిర్మించారు. 2023 వరకు వ్యాపార కేంద్రంగా విరాజిల్లిన మార్కెట్, ప్రభుత్వం మారడంతో పట్టించుకునే నాథుడు లేక వెలవెలబోతున్నది. కాంగ్రెస్ సర్కార్ కూరగాయల మార్కెట్‌ను మరో ప్రాంతానికి తరలించింది. దీంతో ఆదివారం మటన్ మార్కెట్ నడుస్తున్నది. మిగితా రోజుల్లో జనాలు కనిపించరు. దీంతో మార్కెట్‌లో ఎక్కడి చెత్త అక్కడే. రామాయంపేట మున్సిపల్‌గా మారినా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మార్కెట్‌కు వెళ్లాలంటేనే కంపు కొడుతుందని జనాలు పట్టించుకోవడం లేదు. ఒక్కరోజే మార్కెట్ నడవడంతో ఎక్కడ కంపు అక్కడే అన్న చందంగా ఉంది. మార్కెట్‌లోనే టాయిలెట్ల వద్ద మురుగు కూపం. తాగునీటి ట్యాంకు పెట్టినా వినియోగంలో లేదు. చెత్త ఎత్తిపోయడానికి చెత్తబండి ఉన్నా ఫలితం లేదు. మున్సిపల్ సిబ్బంది ఉన్నా కనీసం అందులో ఉన్న చెత్తను తీసుకుపోరు. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది.

### దుర్వాసన భరించలేకుండా ఉంది



రైతు బజార్లో మాంసం దుర్వాసన భరించలేకుండా ఉంది. ఎన్నిసార్లు మున్సిపల్ వాళ్లకు చెప్పినా పట్టించుకుంటలేరు. మేకలు, గొర్రెలు కోస్తూ వాటి వ్యర్థాలను మార్కెట్‌లోని ఆరుబయటనే పడేస్తారు. వారికెన్ని సార్లు చెప్పినా వింటలేరు. రైతు బజార్ లోనే ఒక పక్కకు పోసి చేతులు దులుపుకొంటరు. కంపుతో మాకు రోగాలు వస్తున్నయి.

**- బుజ్జమ్మ, రైతుబజార్ కాలనీవాసి**

### మున్సిపల్ వాళ్లు పట్టించుకుంటలేరు



మా ఇంటి దగ్గరే కూరగాయల మార్కెట్ ఉంది. కాని కూరగాయలు దొరకవు. రైతు బజార్‌లో మాంసం విక్రయాలు జరుగుతాయి. ఆదివారం వస్తే దుర్గంధంతో భరించలేకుండా ఉంటాం. వాళ్లు జీవాల వ్యర్థాలు అందులోనే పడేస్తారు. దీంతో వాసన భరించలేకపోతున్నం. మున్సిపల్ వారు వెంటవెంటనే తీసుకుపోతే ఈ వాసన మాకు ఉండది.

**- దేవుని సుజాత, రైతు బజార్ కాలనీ**

# 14.86 లక్షల బ్యాంకు రుణాల మళ్లింపు



రుణాల మళ్లింపుపై విచారణ చేస్తున్న అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

పాపన్నపేట, మే 16: స్వయం స హాయక సంఘాల్లో 75 లక్షలు స్వా హా శీర్షికన ఈనెల 16న నమస్తే తెలంగాణలో ప్రచురితమై వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. శుక్రవారం విచారణ ప్రా రంభమైంది. డీఎంజీ సీబీవో ఆడిటర్ నాగరాజు, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ రజిత పాపన్నపేట వచ్చి, ఏపీఎం సాయిలు తో కలిసి పొడ్చాన్‌పల్లి యూకో బ్యాంకు నుం చి స్టేట్‌మెంట్ సేకరించారు. వాటి లావాదేవీలను పరిశీలిస్తున్నారు. హైదరాబాద్ జోనల్ ఆఫీస్ నుంచి బ్యాంకు అధికారులు విచారణకు రానున్నట్లు మేనేజర్ అజారుద్దీన్ తెలిపారు. పోలీస్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఆరా తీస్తున్నారు.

**రెండేళ్లలో రూ,14.86 లక్షలు మళ్లింపు**

స్వయం సహాయక సంఘాల అకౌంట్ నుంచి నేరుగా వీవోఏ అకౌంట్లోకి రెండేళ్లలో రూ.14.86 లక్షల బ్యాంకు రుణాలు మళ్లించినట్లు తెలిసింది. గంగపుత్ర స్వయం సహాయక గ్రూపు నుంచి రూ,6,69,000, విజయ గ్రూపు నుంచి రూ,1,42,000, పోచమ్మ గ్రూపు నుంచి రూ,6,75,000 మళ్లించినట్లు సమాచారం.

**అధికారులపై అనుమానాలు**

బ్యాంకు, వెలుగు అధికారులు, వీవోఏ పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాలకు మంజూరయ్యే బ్యాంకు రుణాలను మొదలు ఎంసీపీ అకౌం ట్లో వేయాలి. అనంతరం ఆ గ్రూపులో ఉన్న సభ్యుల వ్యక్తిగత ఖాతాలో జమచేయాలి. ఇక్కడ బ్యాంకు అధికారులు నేరుగా వీవోఏ వ్యక్తిగత ఖాతాలో వేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

**అందరూ కలిసి మోసం చేశారు: పద్మ, వీఓఏ**

ఈ రుణాల స్వాహా వ్యవహారంలో అందరూ కలిసి నన్ను మోసం చేశారు. డబ్బులు బ్యాంకు అధికారులు, మహిళా సమైక్య, మండల, గ్రామ స్థాయి అధికారులకు పంచి ఇచ్చాను. ఈ తతంగంలో అందరూ బాధ్యులే. అయినా నన్ను బలి పశువు చేశారు. అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలి

# బాల్యవివాహాన్ని అడ్డుకున్న సీడీపీవో



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో హేమభార్గవి

నర్సాపూర్, మే16: మండలంలోని గొల్లపల్లిలో ఉన్న ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బాల్య వివాహాన్ని రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలిసి ఐసీడీఎస్ సీడీపీవో హేమభార్గవి శుక్రవారం అడ్డుకున్నారు. ఓ గ్రామానికి చెందిన 16 ఏండ్ల బాలిక వివాహం జరిపిస్తున్నారన్న సమాచారంతో ఐసీడీఎస్ సీడీపీవో అక్కడకు చేరుకుని వివాహాన్ని ఆపివేసి పెళ్లికూతురిని సీడబ్ల్యూవోలో ప్రొడ్యూస్ చేశారు. బాల్య వివాహాలు చేయించడం చట్టవిరుద్ధమని, ఇందుకు చట్టపరమైన చర్యలు తప్పవని సీడీపీవో హెచ్చరించారు. బాల్యవివాహం జరిపిస్తున్న పెళ్లి కూతురు తల్లితో, పెళ్లికొడుకుతో మాట్లాడి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు జరిగితే సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

శివ్వంపేట/చిన్నశంకరంపేట, మే 16 : సమాజంలోని 15 నుంచి 35 ఏండ్ల మధ్య నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎంఈవోలు బుచ్యానాయక్, పుష్పవేణి అన్నారు. శుక్రవారం శివ్వంపేటలో ఉల్లాస్ పోగ్రాంపై వీఏవో, సీసీ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఏపీఎంలతో సమావేశం నిర్వహించారు. ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లర్నింగ్ ఫర్ సొసైటీ) ఆవశ్యకతను వివరించారు. నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

# రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు





రామాయంపేటలో రైస్‌మిల్లును సందర్శించి ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

- లారీలను త్వరగా అన్‌లోడ్ చేయించండి
- మెదక్ ఆర్డీవో రమాదేవి

రామాయంపేట, మే 16: ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని, రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యం లారీలను వెంటనే అన్‌లోడ్ చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ రజినీకుమారితో కలిసి రైస్‌మిల్లులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. మ్యాచ ర్ రాగానే ధాన్యం వేగంగా తూకం వేసి లారీల్లో పం పించాలన్నారు. హమాలీలను అందుబాటులో ఉంచుకుని తొందరగా లోడింగ్ చేయాలని, రైస్ మిల్లర్లు కూడా వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, మే 16: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తూకం వేసిన ధాన్యం తరలింపులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని ఆర్డీవో రమాదేవి సిబ్బందికి సూచించారు. నిజాంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించారు. జూన్ 2 నుంచి భూ భారతి పోర్టల్‌పై అవగాహన కల్పించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ, ఆర్.ప్రీతి, ఇమాద్ ఉన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, మే16: కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఆర్‌ఎం. శుభవల్లి, జూనియర్ సివిల్ జడ్జి ఎం.హేమలత తెలిపారు. శుక్రవారం లోక్ అదాలత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు రాజీ పడదగ్గ కేసులను ఎక్కువ సంఖ్యలో కుదుర్చుకుని పరిష్కరించుకునేలా కృషి చేయాలని పోలీస్ అధికారులు, న్యాయవాదులకు సూచించారు. అనంతరం జూన్ 14న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మెదక్ జిల్లా కోర్టు, నర్సాపూర్ జూనియర్ సివిల్ డెడ్ కోర్టులో కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ గౌడ్, ఏపీపీ రాఘవేందర్, ప్రభుత్వ సహాయ న్యాయవాది పి.సుధాకర్, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-AII

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.